క్లుప్తంగా

విత్తనాభివృద్ధి సంస్థ మేనేజర్‌గా భిక్షం

ఖమ్మంవ్యవసాయం: ఉమ్మడి ఖమ్మం జిల్లా తెలంగాణ విత్తనాభివృద్ధి సంస్థ ప్రాంతీయ మేనేజర్‌గా ఎస్.భిక్షం నియమితులయ్యారు. వనపర్తి తెలంగాణ విత్తనాభివృద్ధి సంస్థ ప్రాంతీయ మేనేజర్‌గా పనిచేస్తున్న భిక్షంను ఉమ్మడి ఖమ్మం జిల్లాకు, ఇక్కడ ప్రాంతీయ మేనేజర్‌గా పనిచేస్తున్న ఎర్రం రాజీవ్‌కుమార్‌ను వనపర్తికి నియమిస్తూ రాష్ట్ర సంఘం బదిలీ చేశారు. దీంతో వీరిరువురు శనివారం బాధ్యతలు స్వీకరించారు.

జయప్రదం చేయండి

తిరుమలాయపాలెం: సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా నాయకుడు రాయల సుభాష్‌చంద్రబోస్ 7వ వర్ధంతి సభను జయప్రదం చేయాలని ఆ పార్టీ జిల్లా నాయకుడు ఆర్.శివలింగం అన్నారు. ఆదివారం వర్ధంతి సభ పోస్టర్లను పిండిప్రోలులోని రాయల వెంకటనారాయణ భవనంలో ఆవిష్కరించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పార్టీ డివిజన్ కార్యదర్శి సీవై పుల్లయ్య మండల కార్యదర్శి కమ్మకోమటి నాగేశ్వరరావు, నాయకులు ఎడ్లపల్లి నవీన్, పులుగుజ్జు వెంకటస్వామి, పుల్లయ్య, ఉప్పలయ్య తదితరులు పాల్గొన్నారు.

స్వాతంత్ర్య సమరయోధుడి మృతి

రఘునాథపాలెం: మండలంలోని వేపకుంట్లకు చెందిన స్వాతంత్ర్య సమర యోధుడు మోడేపల్లి వీరబ్రహ్మచారి(93) ఆదివారం వేపకుంట్లలో మృతి చెందాడు. వీరబ్రహ్మచారికి భార్య, ఒక కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. గ్రామంలోని దేవాలయంలో చాలా కాలం నుంచి పూజారిగా పనిచేశారు. వీరబ్రహ్మచారి మృత దేహంపై పూలు వేసి పలువురు నివాళులర్పించి కుటుంబసభ్యులకు సానుభూతి తెలిపారు.

త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం

ఖమ్మంగాంధీచౌక్: త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక ఖమ్మం కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం నగరంలోని త్రీటౌన్ మోతేనగర్ ప్రాంతంలో త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. త్రిమత గురువు, తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ అవార్డు గ్రహీత ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరులు రాసిన ఆధ్యాత్మిక త్రైత సిద్ధాంత గ్రంథాలను ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో ఇందూ జ్ఞాన వేదిక ప్రతినిధులు సత్యం, సాంగ్యా, రామకృష్ణ, ఉమేష్, సంజయ్, నాగరాజు, అశ్విని, సుజాత, ఐశ్వర్య, విజయమ్మ తదితరులు పాల్గొన్నారు.

'క్రియేటివ్'లో ఫేర్‌వెల్ డే

ఖమ్మం సహకారనగర్: నగరంలోని క్రియేటివ్ హైస్కూల్‌లో ఆదివారం ఫేర్‌వెల్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ బిజ్జాల కమలాకర్ మాట్లాడుతూ.. విద్యార్థులు చిన్నతనం నుంచే ఇష్టపడి చదువుతూ.. నేర్చుకున్న పాఠాలను స్నేహితులతో చర్చించినప్పుడే పలు సందేహాలు నివృత్తి అయి కొత్త విషయాలు తెలుస్తాయన్నారు. తొలుత జ్యోతి ప్రజ్వలన చేసి ఆయన కార్యక్రమాన్ని ప్రారంభించగా... విద్యార్థులు చేసిన నృత్యాలు అందరిని ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ కౌశిక్ బిజ్జాల, ఉపాధ్యాయ, ఉపాధ్యాయేతర సిబ్బంది పాల్గొన్నారు.

విలీనం ఆలోచనను విరమించుకోవాలి

ఖమ్మం సహకారనగర్: రాష్ట్రంలో కేబినెట్ సబ్ కమిటీ సమావేశంలో 50 మంది కంటే తక్కువ విద్యార్థులున్న హాస్టళ్లను సమీపంలోని హాస్టళ్లలో విలీనం చేయాలనే ఆలోచనను విరమించుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ప్రవీణ్ అన్నారు. ఆదివారం నగరంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పేద విద్యార్థులు, గ్రామీణ, ఆదివాసీ, దళిత విద్యార్థుల అభివృద్ధికి పట్టుకొమ్మలుగా హాస్టళ్లు ఉన్నాయన్నారు. ఈ సమావేశంలో నాయకులు రాగిణి, శ్రీశావ్య, నిఖిత, భవ్యశ్రీ తదితరులు పాల్గొన్నారు.

కందాల విజయమ్మ పరామర్శ

తిరుమలాయపాలెం: ఇటీవల రోడ్డు ప్రమాదంలో తీవ్రగాయాలై ఖమ్మం కిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న పిండిప్రోలు గ్రామానికి చెందిన జర్నలిస్టు ఎల్.ప్రవీణ్‌ను ఆదివారం పాలేరు ఎమ్మెల్యే కందాల ఉపేందర్‌రెడ్డి సతీమణి విజయమ్మ ఆస్పత్రిలో పరామర్శించారు. ఈ సందర్భంగా ప్రవీణ్ ఆరోగ్య పరిస్థితిని తెలుసుకుని కుటుంబ సభ్యులకు రూ.30వేల ఆర్థిక సాయమందించారు. ఈ కార్యక్రమంలో చావా శివరామకృష్ణ, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

నగరంలో సినిమాలు

తిరుమల	సార్
వినోద	బలగం
సాయిరాం	ఆర్గానిక్ మామా హైబ్రిడ్ అల్లుడు
ఆదిత్య	వినరో భాగ్యము విష్ణుకథ
శ్రీనివాస	వాల్తేరు వీరయ్య
సుందర్	గ్యాంగ్ లీడర్

- ఖమ్మంగాంధీచౌక్

ధీమా ఇవ్వని బీమా..!

పత్తి రైతుకు పంట నష్టం దిగులు
- వాతావరణ బీమాపై స్పందన కరువు
- స్పష్టత ఇవ్వని అధికారులు
- అయోమయంలో రైతులు


తల్లంపాడులో ఎండిపోయిన పత్తి చేను

వాతావరణం అనుకూలించలేదు.. అయినా అధికారుల సూచన మేరకు ఇన్సూరెన్స్ చెల్లించారు. ప్రస్తుతం బీమా వస్తుందో? రాదో? తెలియక అయోమయంలో ఉన్నారు. ఇది పత్తి రైతుల ఆవేదన. ప్రభుత్వం వాతావరణం ఆధారంగా రైతులు పంట నష్టపోతే ఇబ్బందులు పడకుండా పంట నష్టం చెల్లించేలా బీమా కట్టించాలని అధికారులను ఆదేశించడంతో అదే రీతిలో అధికారులు ప్రచారం నిర్వహించి బీమా కట్టించారు. అయితే గతంలో వర్షం ద్వారా నష్టపోయిన వరి పంటను అధికారులు సర్వే చేయగా.. పత్తి పంట ఊసెత్తలేదు. దీంతో బీమా వస్తుందో లేదోనని రైతులు ఆందోళన చెందుతున్నారు.

ఖమ్మంరూరల్: మండలంలో మొత్తం 26 వేలు ఎకరాల్లో 3,000 మంది రైతులు పత్తిపంట సాగు చేశారు. ఇందులో సుమారు 800 మంది రైతులు పత్తికి వ్యవసాయ ఆధారిత బీమా చెల్లించారు. బ్యాంక్ రుణాలు తీసుకున్న రైతులకు బ్యాంకులు బీమా చెల్లించగా.. మిగతా వారు ఇన్సూరెన్స్ చెల్లించారు. గతంలో ప్రారంభ దశలో వర్షాలు లేక ఇబ్బందులు పడగా.. తర్వాత ఎడతెరిపి లేని వర్షాలతో రైతులు కష్టాలు ఎదుర్కొన్నారు.

పెట్టుబడి సైతం...

చాలామంది పెట్టుబడులు పెట్టలేక తమ చేలను మధ్యలోనే వదిలేశారు. పంట దిగుబడి కోసం రైతులకు అధిక పెట్టుబడి కాగా ఆశించిన స్థాయిలో దిగుబడి, పెట్టిన పెట్టుబడి రాక తలలు పట్టుకుంటున్నారు. అధికారులను బీమా విషయం అడిగితే వాతావరణ ఆధారిత బీమా సంబంధిత కంపెనీ ప్రభుత్వం వర్షపాతం ఆధారంగా నిర్ణయం తీసుకుంటుందని, తమకు సమాచారం లేదని చెబుతుండటంతో ఏం చేయాలనే స్థితిలో రైతులు ఉన్నారు. అధికారులు బీమా కట్టమంటే కట్టినం.. ప్రస్తుతం వస్తుందో రాదో అని కూడా చెప్పడం లేదని వాపోతున్నారు. పంటకు పెట్టిన పెట్టుబడి రాక దిగులులో రైతులున్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి రైతులను ఆదుకోవాలని కోరుతున్నారు.

ఎకరాకు 4 క్వింటాలే దిగుబడి..



నాలుగు ఎకరాల్లో పత్తి పంట వేశా. ఎకరాకు రూ.40వేలు పెట్టుబడి పెడితే నాలుగు క్వింటాలే దిగుబడి వచ్చింది. కనీసం పెట్టిన పెట్టుబడి కూడా రాలేదు. పంటల బీమా పథకం కూడా వర్తించ లేదు. పత్తి రైతులను ప్రభుత్వమే ఆదుకోవాలి.

– సీతారాములు, రైతు, ముత్యాలగూడెం

బీమా ఇచ్చి ఆదుకోవాలి..



ప్రతీ ఏటా పత్తి చేను వేయడం దిగుబడి రాక నష్టాలు రావడం గత అయిదారేళ్లుగా జరుగుతోంది. నష్టాలు వచ్చినప్పుడు బీమా డబ్బులు వస్తే.. కనీసం పంట పెట్టుబడి అయినా పూడుతుందని ఆశించా. బీమా ఇచ్చి ఆదుకోవాలి.

– నర్రా వెంకటనర్సయ్య, రైతు, చేగొమ్మ

రేపటి నుంచి అంకమ్మ జాతర

నేలకొండపల్లి: మండలంలోని చెరువుమాధారంలో శ్రీ అంకమ్మ తల్లి జాతర మంగళవారం నుంచి జరగనుంది. 1961లో ఇక్కడ నిర్మించిన ఆలయ పర్యవేక్షణ బాధ్యతలు కనమర్లపూడి సైదులు నిర్వర్తించగా.. ఇటీవల ఆయన మృతి చెందారు. కాగా, ఆయన కుటుంబీకుల ఆధ్వర్యాన ఈసారి 7 నుంచి 11వ తేదీ వరకు జాతర అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. జాతరలో భాగంగా 7వ తేదీన శివపార్వతుల కల్యాణం, జలబిందెలు, 8న అమ్మవారికి బోనాల సమర్పణ, గ్రామ ప్రభల ఊరేగింపు, 9న బోనాల సమర్పణ, 10న మర్రి అనకట్టుట, అమ్మవారి గ్రామసేవ, 11న చంద్రపట్నం, సామూహిక శ్రీ సత్యనారాయణస్వామి వ్రతాలు ఉంటాయి. కాగా, 9, 10, 11వ తేదీల్లో రెండు తెలుగు రాష్ట్రాల స్థాయిలో నిర్వహించనున్న ఎడ్లబండి లాగుడు పోటీలు, రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీల నిర్వహణకు ఏర్పాట్లు కూడా పూర్తయ్యాయి.


చెరువుమాధారంలోని శ్రీ అంకమ్మతల్లి ఆలయం

కైకొండాయిగూడెంలో..

ఖమ్మంఅర్బన్: నగరంలోని 4వ డివిజన్‌లోని కైకొండాయిగూడెం ప్రధాన రహదారిలోని శ్రీఅంకమ్మ, శ్రీమహాలక్ష్మమ్మ, శ్రీమద్దిరావమ్మ అమ్మవార్ల జాతర మహోత్సవాలు రేపటి నుంచి 11వ తేదీ వరకు నిర్వహించబడతాయని ఆలయ కమిటీ చైర్మన్ కొమ్ము భాస్కరరావు తెలిపారు. ఆదివారం దేవాలయ ప్రాంగణంలో జాతర మహోత్సవ వివరాలను కమిటీ ఆధ్వర్యంలో కరపత్రం ఆవిష్కరించి వివరాలు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన కార్యదర్శి సూరంశెట్టి నర్సింహారావు, కోశాధికారి గుండోజు రామాచారి, సభ్యులు గాదె రాంబాబు, కాటేపల్లి రమేష్, రెడ్డిబోయిన వెంకటేశ్వర్లు, యలమందల రామారావు, గుగ్గిళ్ల జనార్దనాచారి పాల్గొన్నారు.

సమస్యలు తెలుసుకుంటూ.. పరిష్కరిస్తూ..

నేలకొండపల్లి: పాలేరు ఎమ్మెల్యే కందాల ఉపేందర్‌రెడ్డి ఆదివారం గుడ్ మార్నింగ్ పాలేరు కార్యక్రమాన్ని రూరల్ మండలంలో నిర్వహించారు. సాయిప్రభాత్‌నగర్, ఆర్ఎస్‌నగర్‌లో వీధి, వీధిన కలియ తిరిగి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మరికొన్ని సమస్యలు ప్రజలు స్వయంగా ఎమ్మెల్యే దగ్గరకు వచ్చి విన్నవించుకున్నారు.సంబంధిత శాఖల అధికారులకు పరిష్కారానికి ఆదేశాలు జారీ చేశారు. అనంతరం మండలంలోని పొన్నెకల్ గ్రామంలో నూతనంగా నిర్మించిన మసీద్‌ను ప్రారంభించి... ముస్లిం సోదరుల కోరిక మేరకు రూ.1.50 లక్షల ఆర్థిక సాయమందిచారు. ఈమేరకు కమిటీ ఆధ్వర్యాన కృతజ్ఞతలు తెలిపి ఘనంగా సన్మానించారు. వివిధ ప్రాంతాల్లో పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ వరప్రసాద్, ఎంపీపీ ఉమ, బెల్లం వేణు, ఎంపీడీఓ అశోక్, పలువురు ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే కందాల ఉపేందర్‌రెడ్డి

ఆర్థిక సాయం

ఖమ్మంమయూరిసెంటర్: కోవిడ్ నుంచి కోలుకున్న అనంతరం పలు రకాల అనారోగ్య సమస్యలతో ఇబ్బంది పడుతున్న, బుర్హాన్‌పురంలోని జెండాల సెంటర్‌కు చెందిన మేకల హరీష్‌కు రాజ్యసభ ఎంపీ వద్దిరాజు రవిచంద్ర రూ.25 వేల ఆర్థిక సాయం అందజేశారు. ఎంపీ తరఫున ఆ మొత్తాన్ని మున్నూరు కాపు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆకుల గాంధీ ఆదివారం బాధిత కుటుంబానికి అందజేశారు.

బాధిత కుటుంబానికి...

కూసుమంచి: నాయకన్‌గూడెం గ్రామానికి చెందిన బుర్రి వెంకన్న ఇల్లు గ్యాస్ సిలిండర్ పేలి ధ్వంసం కాగా శనివారం బాధిత కుటుంబాన్ని వైఎస్ షర్మిల వ్యక్తిగత సహాయకుడు నంద్యాల రవీందర్‌రెడ్డి పరామర్శించి ఆర్థిక సాయమందించారు. పార్టీ మండల అధ్యక్షుడు వైవీడీ రెడ్డి, ప్రధాన కార్యదర్శి బానోత్ ఉపేందర్, యువజన అధ్యక్షుడు కిషోర్ నాయక్, నాయకులు గంగారెడ్డి, శ్రీశైలం, ప్రసాద్ తదితరులు ఉన్నారు.

రాయపర్తికి తరలిన బచ్చోడు మహిళలు


రాయపర్తికి బయలుదేరుతున్న మహిళలు

తిరుమలాయపాలెం: వరంగల్ జిల్లా రాయపర్తి మండల సమైఖ్య ఆధ్వర్యాన నాబార్డు వారి సహకారంతో నిర్వహిస్తున్న ఉపాధి పథకాలపై నిర్వహించిన శిక్షణ కార్యక్రమానికి ఆదివారం మండలంలోని బచ్చోడు గ్రామానికి చెందిన 40 మంది మహిళలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్టాల్స్‌లో మహిళల ఉపాధికి కుట్టు శిక్షణ, ఎండుగడ్డి కట్టుట, ఇతర స్టాల్స్‌ని సందర్శించారు. జిల్లాలోని ఆయా మండల సమైఖ్యల మహిళలు చేస్తున్న ఉపాధి ఆర్థిక ప్రగతిని తెలుసుకున్నారు. మహిళలు తిమ్మిడి సైదమ్మ, వెంకటమ్మ, దుర్గమ్మ తదితరులు పాల్గొన్నారు.

వివేకానంద సాహిత్యం యువతకు స్ఫూర్తిదాయకం


విహె క్యాంపస్‌ను ప్రారంభిస్తున్న స్వామీజీ

ఖమ్మంగాంధీచౌక్: ఆధ్యాత్మిక వేత్త స్వామి వివేకానంద సాహిత్యం యువతకు స్ఫూర్తిదాయకమని హైదరాబాద్ రామకృష్ణ మఠం స్వామీజీ శితికంఠానంద మహారాజ్ అన్నారు. ఆదివారం ఖమ్మం నగరంలోని వైరారోడ్డు ఓల్డ్ ఎల్ఐసీ కార్యాలయం వద్ద వివేకానంద ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హ్యూమన్ ఎక్సలెన్స్ (విహె) సిటీ కార్యాలయాన్ని స్వామీజీ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. సంస్థ డైరెక్టర్ దేవకీ వాసుదేవరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో స్వామీజీ మాట్లాడుతూ.. దశాబ్ద కాలంగా విహె సంస్థ కుట్టు శిక్షణ, టైలరింగ్, కొటేషన్ ఫ్యాషన్, డిజైనింగ్ వంటి కోర్సులతో పాటు స్పోకెన్ ఇంగ్లిష్, పర్సనాలిటీ డెవలప్‌మెంట్, పిల్లలకు బాలవికాస్ వంటి కార్యక్రమాలను నిర్వహిస్తునట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు కేశవలాల్ పటేల్, కాళ్ల పాపారావు, సత్యనారాయణ, సీతారాంబాబు, డాక్టర్ వీరేశ్వర్, వనమా కోటేశ్వరరావు, హజారి శ్రీనివాస్, చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

భూ ఆక్రమణలను అడ్డుకోవాలి


సమావేశంలో మాట్లాడుతున్న కేవీ కృష్ణారావు

ఖమ్మం మామిళ్లగూడెం: ప్రజా సమస్యలపై ఐక్యవేదిక తన వంతు పాత్ర క్రియాశీలకంగా పోషిస్తుందని బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, ప్రజా సంఘాల ఐక్యవేదిక చైర్మన్ డాక్టర్ కేవీ కృష్ణారావు అన్నారు. ఆదివారం సంఘ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రఘునాథపాలెం మండలం కోయచిలక సర్వే నంబర్ 192, 30లలో ప్రభుత్వ భూములను యథేచ్ఛగా నిబంధనలకు విరుద్ధంగా ఆక్రమించుకొని అమ్ముకుంటున్నారని ఆరోపించారు. దీనిపై అధికారులు చర్యలు తీసుకోకుంటే దశల వారి ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో కన్వీనర్ గుంతేటి వీరభద్రం, భద్రూనాయ్, రెహమాన్, వెంకటరమణ, నజీమా, సంజీవరావు, మస్తాన్, శ్రీనివాసరెడ్డి, దాసరిశ్రీను, అఖిల్, సోమరాజు, ఉపేంద్రనాయక్, రమ్య, చంద్రశ్రీ, శంకర్, బాబు, రవి, వెంకటేశ్వర్లు, నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సంక్షోభంలో ప్రభుత్వ విద్యావ్యవస్థ

ఖమ్మంమయూరిసెంటర్: పాలకుల వైఖరితో ప్రభుత్వ విద్యావ్యవస్థ సంక్షోభంలోకి కూరుకుపోయిందని, వారే ప్రైవేట్, కార్పొరేట్ విద్యను ప్రోత్సహిస్తున్నారని ఏఐఎస్ఎఫ్ జాతీయ మాజీ నాయకుడు పోటు ప్రసాద్ ఆరోపించారు.రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠరెడ్డి అధ్యక్షతన స్థానిక సీపీఐ కార్యాలయంలో నిర్వహించిన ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సమితి సమావేశంలో ఆయన మాట్లాడారు. బీజేపీ నూతన జాతీయ విద్యా విధానాన్ని తీసుకొచ్చి పేద, మధ్య తరగతి ప్రజలకు విద్యను దూరం చేసేందుకు ప్రయత్నిస్తున్నారని ఆయన తెలిపారు. విద్య విషయంలో బీజేపీ, బీఆర్ఎస్ దొందూ దొందేనని.. నాణ్యమైన విద్యను అందించడంలో విఫలమయ్యాయన్నారు.ప్రభుత్వ విధానాలపై పోరాటాలు చేసేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని పిలుపునిచ్చారు. అనంతరం ఏఐఎస్ఎఫ్ మాజీ నాయకుడు, కార్పొరేటర్ బీజీ క్లైమెంట్, ఏఐఎస్ఎఫ్ నాయకుడు రావి శివరామకృష్ణ, ఎస్ఏ స్టాలిన్ ప్రసంగించారు. కౌన్సిల్ సమావేశంలో ప్రజానాట్యమండలి కళాకారుడు రాము ఆలపించిన గేయాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి పుట్టా లక్ష్మణ్, రాష్ట్ర సమితి సభ్యులు ఇటికాల రామకృష్ణ, రెహ్మాన్, బరిగల వెంకటేష్, క్రాంతి, రఘురాం, లెనిన్, రాజు, నాగజ్యోతి, జిల్లా నాయకులు మడుపల్లి లక్ష్మణ్, సంతోష్, మురళీకృష్ణ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పోటు ప్రసాద్

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన


వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న సునీల్‌కుమార్

ఖమ్మం వైద్యవిభాగం: జంగాల రాజేశ్వరరావు సేవ్ యువర్ లివర్ ఫౌండేషన్ ఆధ్వర్యాన ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. మయూరిసెంటర్‌లోని సాయిరాం గ్యాస్ట్రో లివర్ ఆస్పత్రిలో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహించిన ఈ శిబిరంలో ప్రముఖ వైద్యుడు జంగాల సునీల్‌కుమార్ బాధితులకు వైద్య పరీక్షలు నిర్వహించిమందులు ఉచితంగా అందించారు. ఈ శిబిరంలో 98 మందికి స్క్రీనింగ్, షుగర్ పరీక్షలు, హెపటైటిస్ బీ వాక్సినేషన్ నిర్వహించగా.. లివర్ ఫైబ్రో స్కానింగ్‌ను 89 మందికి నిర్వహించారు. తమ ఫౌండేషన్ ఆధ్వర్యాన ప్రతీ మొదటి, మూడో ఆదివారం వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు జంగాల శ్రీధర్ తెలిపారు.

తులాభారంతో డీసీసీబీ చైర్మన్‌కు ఘన సన్మానం


డీసీసీబీ చైర్మన్‌కు తులాభారం వేస్తున్న దృశ్యం

ఖమ్మంఅర్బన్: జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ చైర్మన్ కూరాకుల నాగభూషణంను ఆదివారం రాత్రి నగరంలోని 14వ డివిజన్ మధురానగర్‌లోని సాయిబాబా మందిరంలో ఘనంగా సన్మానించారు. యాదవ సంఘం ఆధ్వర్యాన ఏర్పాటు చేసిన తులాభార కార్యక్రమంలో కూరాకుల దంపతులకు గజమాలతో సత్కరించారు. అనంతరం దేవాలయ ప్రాంగణంలో నాగభూషణంను రూపాయి నాణేలతో తులాభారం కార్యక్రమం నిర్వహించనగా 80 కేజీల బరువుకు సమతూగారు. బ్యాంక్ చైర్మన్‌గా మూడేళ్లు పూర్తి చేసుకొని, డీసీసీబీని రాష్ట్రంలోనే 2వ స్థానంలో నిలబెట్టినందుకు ఈ సన్మాన కార్యక్రమం నిర్వహించారు. నగరంలోని కార్పొరేటర్లు, వైద్యులు, కుల సంఘాల నాయకులు, న్యాయవాదులు, రియల్ ఎస్టేట్ వ్యాపారులు పాల్గొన్నారు.

పాఠశాలకు బోరు..

ఖమ్మంఅర్బన్: నగరంలోని ఇందిరానగర్ పాఠశాలలో పూర్వ విద్యార్థులు బోరు ఏర్పాటు చేశారు. పాఠశాలలో తాగునీటి ఎద్దడి తీర్చడానికి పదో తరగతి (1997–98) బ్యాచ్‌కు చెందిన విద్యార్థులు కలిసి ఆదివారం బోరు వేయించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం శైలజలక్ష్మి, కార్పొరేటర్ చావా మాధురినారాయణరావు, ఉపాధ్యాయులు కృష్ణవేణి, హరిప్రసాద్, వెంకటేశ్వరరావు, యాకూబ్ బాషా, సలీం, పుల్లారావు, నరేష్, హరీష్ తదితరులు పాల్గొన్నారు.

ఏసుక్రీస్తు మార్గాన్ని అనుసరించాలి

నేలకొండపల్లి: ప్రతి ఒక్కరూ ఏసుక్రీస్తు మార్గాన్ని అనుసరించాలని సెవెంత్ డే అడ్వంటీస్ ఈస్ట్ తెలంగాణ సెక్షన్ ప్రెసిడెంట్ టీడీ ప్రాంచెస్ సూచించారు. మండలంలోని భైరవునిపల్లిలో చర్చి 18వ మందిర ప్రతిష్ఠ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. తొలుత కేక్ కట్ చేసి వేడుకలు ప్రారంభించగా.. ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడగా.. ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉటుకూరి జాన్ సుధాకర్‌రావు, వడ్డమూడి డేవిడ్, కె.జాన్, చంద్రన్ శేఖరం, ఎంపీటీసీ మరికంటి ఉమ, పాస్టర్లు ఆజయ్, మధు, యాకోబ్, సంఘం పెద్దలు, తదితరులు పాల్గొన్నారు.

చిన్నారుల పట్ల నిర్లక్ష్యం వహించొద్దు

ఖమ్మం వైద్యవిభాగం: తలసేమియా, సికిల్‌సెల్‌తో బాధపడుతున్న చిన్నారుల పట్ల తల్లిదండ్రులు నిర్లక్ష్యం వహించొద్దని వైద్యుడు డి.నారాయణమూర్తి, సంకల్ప స్వచ్ఛంద సేవా సంస్థ కోశాధికారి పి.రవిచందర్‌లు అన్నారు. ఆదివారం ఖమ్మంలోని రితన్య ఆస్పత్రిలో సంకల్ప స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న తలసేమియా డే కేర్ సెంటర్‌లో చిన్నారులకు రూ.లక్ష విలువైన మందులను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో దామెర రవి, సంస్థ బాధ్యులు ప్రొద్దుటూరి ఉదయ్ భాస్కర్, అనిత, వంశికిరిటీ, నెల్లూరి ఉపేందర్, వీణ, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం గొప్పది..


శిబిరంలో పాల్గొన్న సీఐ సర్వయ్య

ఖమ్మంరూరల్: అన్ని దానాల కన్నా రక్తదానం ఎంతో గొప్పదని ఖమ్మం త్రీటౌన్ సీఐ సర్వయ్య అన్నారు. గురు దక్షిణ ఫౌండేషన్ ఆధ్వర్యాన పోలేపల్లిలో జరిగిన తలసేమియా పిల్లల సహాయార్థం రక్తదాన శిబిరం జరిగింది. ఈ కార్యక్రమానికి హాజరైన సీఐ మాట్లాడుతూ.. తలసేమియా వ్యాధిగ్రస్తులకు ప్రతీ 15 రోజులకోసారి రక్తం ఎక్కించాల్సి ఉంటుందున ప్రతి ఒక్కరూ రక్తదానం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో 32 మంది యోగసాధకులు రక్తదానం చేశారని అన్నారు. గురు దక్షిణ ఫౌండేషన్ చైర్మన్ శంకరయ్య, జనరల్ సెక్రటరీ సత్యనారాయణప్రసాద్, యోగా మాస్టర్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కందాల కూడా నాన్ లోకలే


విలేకరులతో మాట్లాడుతున్న రవీందర్‌రెడ్డి

కూసుమంచి: తాను లోకల్ అని తనకే ఎమ్మెల్యేగా పోటీ చేసేహక్కు ఉందని పాలేరు ఎమ్మెల్యే కందాల ఉపేందర్‌రెడ్డి మాట్లాడటం సరికాదని వైఎస్ షర్మిల వ్యక్తిగత సహాయకుడు నంద్యాల రవీందర్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని నాయకన్‌గూడెం గ్రామంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రస్తుతం ఎమ్మెల్యే తండ్రి కందాల నర్సింహారెడ్డిది నల్గొండ జిల్లా నుంచి కూసుమంచి మండలంలోని రాజుపేట వచ్చారని, ఇలా అనేక మంది స్థానికేతరులను పాలేరు ప్రజలు ఎమ్మెల్యేలు, మంత్రులు చేశారని గుర్తు చేశారు. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి పేరు చెప్పుకొని గత ఎన్నికల్లో ఎమ్మెల్యేగా గెలిచిన కందాల ఇప్పుడు అధికార పార్టీలో ఉన్నానని విగ్రహాలు తొలగించటం ఎంత వరకు సబబు అన్నారు. షర్మిలపై విమర్శలు చేస్తే తగిన గుణపాఠం తప్పదని హెచ్చరించారు. ఈ విలేకరుల సమావేశంలో వైఎస్సార్‌టీపీ మండల అధ్యక్షుడు వైవీడీ రెడ్డి, ప్రధాన కార్యదర్శి బాణోత్ ఉపేందర్, యువజన అధ్యక్షుడు కిషోర్‌నాయక్, నాయకులు గంగారెడ్డి, శ్రీశైలం, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ విగ్రహాల జోలికొస్తే సహించం..

నేలకొండపల్లి: వైఎస్సార్ విగ్రహాల జోలికొస్తే సహించేది లేదని యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి జెర్రిపోతుల అంజిని హెచ్చరించారు. మండల కేంద్రంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. మహానేత రాజన్నను ప్రజల నుంచి దూరం చేయొచ్చేమో గానీ వారి గుండెల్లో నుంచి కాదన్నారు. ఎవరి ఫిర్యాదు లేకుండానే రాజన్న విగ్రహాలను తొలిగించటంలో రాజకీయం ఉందని, ఇలాంటి చర్యలు మానుకోకపోతే ప్రతీ ఊరికో రాజన్న విగ్రహాన్ని ఏర్పాటు చేస్తామని హెచ్చరించారు.

ప్రజా సమస్యలపై సీపీఎం పాదయాత్ర

ఖమ్మం మామిళ్లగూడెం: అర్హులందరికీ డబుల్ బెడ్ రూం ఇళ్లు, సొంత జాగా ఉన్న వారికి రూ.5 లక్షలు రుణం ఇవ్వాలని సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రజా సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఆదివారం త్రీటౌన్ కమిటీ ఆధ్వర్యాన 29వ డివిజన్ ప్రకాశ్‌నగర్ ఆటోస్టాండ్ నుంచి మొదలుపెట్టిన పాదయాత్రను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా నున్నాతో పాటు జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఎర్రా శ్రీకాంత్ మాట్లాడుతూ.. బీజేపీ పాలన వచ్చిన తర్వాత గ్యాస్ ధరలతో పాటు నిత్యావసర వస్తువుల ధరలు, పెట్రో ధరలు విపరీతంగా పెంచి పేదల నడ్డి విరుస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ముస్లిం, క్రిస్టియన్లపై దాడులు ఎక్కువగా జరుగుతున్నాయన్నారు. తినే తిండి, కట్టుకునే బట్టలపై కూడా ఆంక్షలు విధిస్తూ, ప్రశ్నించే వారిని దేశద్రోహులుగా ముద్రలు వేసి జైల్లో పెడుతున్నారని తెలిపారు. వీటన్నింటిపై సీపీఎం ఆధ్వర్యాన అన్ని మండలాల్లో పాదయాత్రలు జరిపి మోదీ విధానాలను ఎండగడతామని హెచ్చరించారు. ఎరుకల కాలనీ ఎస్సీ కాలనీ, సుందరయ్య పార్కు వరకు పాదయాత్ర కొనసాగించారు. భూక్యా శ్రీనివాసరావు అధ్యక్షతన నిర్వహించిన ఈ పాదయాత్రలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వై.విక్రం, నాయకులు ఎర్రా శ్రీనివాసరావు, కార్పొరేటర్ ఎల్లంపల్లి వెంకట్రావు, శ్రీనివాసరావు, నాగసులోచన, సైదులు, షేక్.హిమాం, వీరబాబు, నరసింహారావు, వెంకటేశ్వర్లు, పేరయ్య, వీరస్వామి, రామకృష్ణ, సుభద్ర తదితరులు పాల్గొన్నారు.


పాదయాత్ర చేస్తున్న సీపీఎం నేతలు